# జబ్బు


ప్రాయోజకులు

**శ్రీ పద్మశాలి సమాజము**

సిద్ధిపేట - 1995 - 98 కార్యవర్గము

అధ్యక్షులు : శ్రీ బేతి పెంటయ్య
ఉపాధ్యక్షులు : శ్రీ బూర మల్లేశం
కార్యదర్శి : శ్రీ రచ్చ దేవదాసు
సహాయ కార్యదర్శి : శ్రీ బల్ల లక్ష్మినారాయణ
కోశాధికారి : శ్రీ వేముల శ్రీరంగము

కార్యవర్గ సభ్యులు :
సర్వశ్రీ కాముని రాజేశం (ఇత్తడి),
చేర్యాల లింగయ్య,
గుజ్జేటి రంగయ్య,
గూడూరి శ్రీనివాస్,
బల్ల శ్రీనివాస్.


"అమ్మాయ్ ! అబ్బాయొచ్చాడా ?"

"ఇంకా రాలేదు మావయ్యా !"

"రాత్రి తొమ్మిదైంది. రోజూ ఇంతేనా ?"

"అబ్బే ! అదేంలేదు మావయ్యా !"

గర్భకుహరములో బడబానలం ఎగిరిపడుతున్నా పైకి ప్రశాంతంగా కనబడుతున్న సముద్రములా అంతరంగ ఆవేదన ఏ మాత్రం బయటికి పొక్కకుండా చెప్పేసింది వైదేహి. వీధిగుమ్మం వద్ద నిల్చున్న దల్లా ముభావంగా అడుగులేస్తూ లోపలికొచ్చేసింది. కంటి రెప్పల నుంచి జారుతున్న ట్యూబులైటు వెలుతురు చెక్కిళ్ళ మీద మెరుస్తూంది.

రాఘవ ఎందుకిలా తయారౌతున్నట్టూ ?

"వచ్చే మొదటి తారీకు మా పెళ్ళి రోజు. మీరు తప్పకుండా వచ్చి దీవించాలి మావయ్యా !" అంటూ తానే ఉత్తరం రాయించాడప్పుడు. పొద్దున అతడాఫీసు కెళ్ళగానే అత్తామామలు దిగారు.

కన్నతల్లిలా అక్కున చేర్చుకుంది అత్తయ్య. అప్యాయంగా పలుకరించి కన్న తండ్రి కంటే మిన్న అన్పించుకున్నాడు మావయ్య.

ఈ పుణ్యమూర్తుల కడుపున పుట్టిన రాఘవ అదృష్టవంతుడు. క్రమశిక్షణే ఊపిరిగా, ఇల్లే వేదపాఠశాలగా చదువు సాగిందట. తండ్రిగారి నిజాయితే పెట్టుబడిగా ఉద్యోగం దొరికిందట.

సరిగ్గా సంవత్సరం క్రితమిదే రోజు అగ్నిదేవుని సాక్షిగా తన మెడమీద నృత్యం చేస్తూ అతని వేళ్ళు మూడుముళ్ళేసాయి. బిందెలో ఉంగరం దేవులాడేప్పుడు చూపుల్తో గిలిగింతలు పెట్టాడు. ఆకులు పోకలందుకునేప్పుడు తన బుగ్గల సిగ్గుల్ని కొసరు చూపుల్తో ఏరుకున్నాడు. ఊహల ఉట్టిమీది సుఖాలను ఉన్నతాదర్శాలతో అనుభవించాలని అతని వెంట ఈ ఊరొచ్చింది. కొత్త కాపురం కొంతకాలం నిత్యవసంతమైంది. ఐదుంబావుకల్లా ఠక్కున ఇంట్లో వాలేవాడు. బిర్లా మందిర్, సాంఘీ దేవాలయం, సాలార్‌జంగ్ మ్యూజియం, జూవాలోజికల్ పార్క్ ... ప్రతి ఆదివారం కొంటె చేష్టల్తో జంటగా తిరిగేవారు. రోజులు క్షణాలైపోయినై.

ఓరోజు ఆఫీసు నుండి చవితిరోజు చంద్రుడిలా రాత్రి ఎనిమిదింటికొచ్చాడు. మొదటిసారి విమానమెక్కుతున్నట్టు అడుగులు అతి జాగ్రత్తగా పడ్తున్నాయి.

"అలవాటులో పొరపాటా ?" అడిగింది తను.

"కాదు ... గ్రహపాటు .. "

"అంటే ... ?!"

"ఆఫీసులో కొత్త ఉద్యోగి పార్టీ డియర్ " అంటూంటే చేతులు నడుమును చుట్టేశాయి. కౌగిలిలో బిగిలేదు. చిరునవ్వులో జీవంలేదు.

అరగంట తర్వాత కొత్త ఉద్యోగి ఇంటికొచ్చాడు.

"ఐదు తర్వాత మీరాఫీసులో లేరు సార్. పార్టీ బాగా జరిగింది" అంటూ స్వీటు పాకెటందించాడు.

"అబ్బా ! కాస్త మెల్లిగా మాట్లాడాలయ్యా ! చాలా రోజుల తర్వాత క్లబ్ నుండి ఫోనొచ్చింది. ఐదింటికే వెళ్ళక తప్పలేదు"

"ఎందుకు సార్ ?"

"ఆఁ ... ఏముందీ ! పాత మిత్రుల్తో పంచముఖ పారాయణం... అదేనయ్యా ... పేకాట ...

బూతుమాట కొత్తగా విన్నట్టు - మూతికి చేతిని అడ్డంగా పెట్టుకుని నవ్వుతూ వెళ్ళాడతను. తాను గదిలోకొచ్చి మంచమ్మీదవాలింది.

"చూశావా వైదేహీ ! మా కొత్తకొలీగ్‌కు నేనంటే ఎంత గౌరవమో ! ఆఫీసులో పార్టీ ఇవ్వడమే కాకుండా ఇంటికొచ్చి ఇదిచ్చి వెళ్ళాడు చూడు" అంటూ కితకితలు పెట్టాడు. వెనక నుండి ఎవరో గొంతు నులుముతున్న ఫీలింగు తనలో

"పంచముఖ పారాయణం బాగాసాగిందా ?"

"అయితే ... అంతా విన్నావన్నమాటా !" అతని మొహం అమావాస్య వెలుగలాగైంది.

"జూదగాళ్ళంటే ... నాకసహ్యం !" తన మొహమటు తిరిగింది.

"అలాగా ! పేకాట నీకిష్టమనుకున్నాను సుమా ! కల్చర్డ్ ఫ్యామిలీ నుంచి వచ్చావు కదా !"

"జూదం కల్తీ కల్చరండీ ! ... " గుండెల్లో చెడుగుడు, గొంతు బరువెక్కింది.

"సరే ... ఈసారి ఆడనులే ! .. " అంటూ తన వైపుకు తిప్పుకున్నాడు. బతిమాలాడు. నవ్వొచ్చింది. చేతిలో చెయ్యేసి సెకండ్‌షో సిన్మాకెళ్తుంటే సామాన్య సైనికుడు చక్రవర్తి సింహాసనమెక్కినంత సంతోషం. మల్లెపూల దండ కొనివ్వగానే మనసులో పన్నీరు చిలికింది.

కాని ... ఆ తర్వాత ఎన్నడూ ఎనిమిది లోపల ఇల్లు గుర్తుకు రాలేదతనికి.

"అమ్మాయ్ వైదేహీ !" అత్తగారి పిలుపులో ఆందోళన.

"రండత్తయ్యా !" గబుక్కున లేచికూచుంది.

"రాత్రి పదైంది. పొద్దున వెళ్ళేప్పుడేమన్నా చెప్పాడా రాఘవ ?"

హమ్మయ్య ! ప్రశ్నలోనే సమాధానానికి క్లూ దొరికింది.

"ఔనత్తయ్యా ! ఈరోజు జీతాలు పంచాలి. ఆలస్యమవొచ్చన్నారండీ !"

"మరి పెళ్ళిరోజు గదా ! ... సరే ... నిద్రొస్తుందమ్మా !"

"మీరు భోంచెయ్యండత్తయ్యా ! మీ అబ్బాయొచ్చాక మేం కలిసి భోంచేస్తాం"

అత్తా మామలు భోంచేసి పడుకున్నారు. వైదేహి మనసు నదిమిపెట్టి గదిలో కొచ్చి పడుకుంది. కళ్ళల్లో రాఘవ ....

ఈయనిహ మారడా ? పోయిన అక్టోబర్ రెండునాడూ ఇంతే ! సెలవురోజు సినిమా ప్రోగ్రాం వేసి చెయ్యిచ్చాడు. రాత్రి పదింటికొచ్చాడు. తలుపు తీయగానే మొలాసిస్ టాంకర్ ఇంటిముందుకొచ్చినట్టు వాసన గుప్పుమంది.

"ఆ వాసనేమిటీ ?" గుమ్మంలో ఆపి నిలదీసింది.

ల్లో ... లోపల్కి రానిస్ ..స్తవాల్లేదా ?" విసుక్కున్నాడు. భుజాలు పట్టి లోపలికి తోసుకొచ్చాడు. చదువురాని మనిషి ద్విత్వాక్షరాలు పలుకుతున్నట్టు నాలుక తిరగడం లేదు.

"మీరు ... మీరు తాగొచ్చారు గదూ !" ఎదకుదుళ్ళలో జీవం పోసుకున్న గుబులు, ఆవేశం పెదాల మీదికొచ్చాయి.

"యస్... పేకాటలో గ్గెలిచా. ఫె.. ఫ్రెండ్స్‌కు పార్టీ ఇచ్చా ..." తుపానుగాలి తాకిడికి పడిపోయిన చెట్టులా మంచమ్మీద వాలిపోయాడు.

హమ్మో ! పేకాటకు తాగుడు జోడైందా ? గుబులు ఉక్రోశంగా రూపాంతరం చెందింది.

"మద్య నిషేధం అమల్లో ఉందిగదా ! ఏ దొంగ వెధవండీ మీ కమ్మిందీ ? అమ్మిన వాణ్ణీ, తాగినవాళ్ళనూ జైల్లో పెట్టి చమ్డాలూడదీసినా పాపంలేదు..."

"హోష్ ! పి.పి. ... పిచ్చిదానా ! ...పగిలిన షోడాబుడ్డిలా నవ్వాడు" ప్రభుత్వ నిషేధం... పర్‌జల కడ్డమా ? ఎక్కువ ధరప్పా.. పారేస్తే ఏదన్నా దొరుకుద్ది"

"తాగుబోతులు సంఘవిద్రోహులండీ"

"ఛా పో .. నో.. నోర్మూస్తావా లేదా ?

"మిమ్మల్నేదో భూతం పట్టింది"

"బ్బూ.. బూతం గీతమంటే ... బ్బొ.. బ్బొక్క లిరుగుతాయ్... జాగర్త ! రోజా కాస్పేపు మ్ము .. ముక్కలాడకుంటే ముక్కులో జ్జో ..జోరీగ జొచ్చినట్టు .. ఏదో .. ఏదోలా ఉంటుంది తెల్సా ? ర్రా ..రా .. !"

ఇలాగైతే సంసారమేంగావాలి ? నాన్నకు ఉత్తరం రాస్తే .. అన్నయ్యను వెంటనే రమ్మని టెలిగ్రామిస్తే .. పోనీ అత్తమామలకే అసలు సంగతి చెబితే ! ప్చ్ .. ఎవరైనా సరే నాలుగు బుద్ధి మాటలు జెప్పి బుద్ధిగా వెళ్ళిపోతారు. దాంతో ఆయన రెచ్చిపోవచ్చు గూడా ...

తలుపుమీద టకటకలు. ఆలోచన ఆగిపోయింది.

పదకొండైంది. తలుపులు తీస్తుంటే చేతులు వణుకుతున్నాయి.

"అబ్బబ్బా ! అప్పట్నుంచి చేతులు పడిపోయేట్టు తలుపులు కొడ్తుంటే ఇప్పుడా తీసేది. అసలీ లోకంలో ఉన్నావా ?" విసురుగా గదిలోకొచ్చాడు రాఘవ.

జుట్టు చెదిరి పెంటకుప్పలాగుంది. పాలిపోయిన మొహం పాత మసిగుడ్డలాగుంది.

"ఈ లోకం నుండి వెళ్ళిపోయినా బాగుండేది. పెళ్ళిరోజు సంబరమంతా పేకముక్కల్లో కరిగిపోయింది." చిర్రెత్తుకొచ్చింది.

నడిబజార్లో పోలీసు దెబ్బలు తిన్నట్టుంది రాఘవకు.

"పొద్దున్నే నీ దరిద్రపు మొహం చూశాను గదా ! జీతం మొత్తం పేకాటలో పోయింది. ఒక్కరోజు .. ఒక్కరోజన్నా విజయంతో తిరిగి రమ్మని పంపావా ? ..." అరుస్తున్నాడు.

"ఆహహ .." వైదేహిలో ఉడుకుమోత్తనం ఉరకలు దీస్తుంది..." మీరు వెళ్తుంది యుద్ధభూమిగ్గదూ ! దేశాన్ని రక్షించాలనే శుభసంకల్పం గదూ ! నేనో వీరపత్నిని గదా ! మీ నుదుట వీరతిలకం దిద్ది పంపించకపోవడం పొరపాటే ... " మెదడు పొరల్లో చెలరేగిన తుపాను కళ్ళను శ్రావణ మేఘాలుగా మార్చేసింది.

"ఏందే ! మాటల్తో చిత్రవధ చేస్తున్నావ్. నీయమ్మ .." డ్రెస్సు మార్చిన రాఘవ కుడి చెయ్యి గాల్లోకి లేచింది. పళ్ళు పటపటలాడ్డున్నై. వైదేహి ఎడమ చెయ్యి ఆ చెయ్యినక్కడే ఆపేసింది.

"అమ్మ నా పెళ్ళామా ! పేరు వైదేహి. ఆహో ! ఇదేదో బద్మాష్. మొగని మీదికి .." ఎడమ పిడికిలి విసురుగా పైకి లేచింది. వైదేహి కుడి చేతిలో పిడికిలి పట్టు సడలింది. చేతుల బలపరీక్షలో రాఘవ చిత్తై పోయాడు. పురుష పుంగవుని పౌరుషం బుసబుసలాడింది. విడిపించుకోవాలని ఎంత గింజుకున్నా అంత బిగుసుకుంటుంది.

కాలేజీలో చదివేటప్పుడు హాబీ కోసం నేర్చుకున్న కరాటే నిత్యజీవితంలో ఉపయోగపడ్తుందని ఇప్పుడు ప్రాక్టికల్‌గా తెలిసిపోయింది వైదేహికి. నరాల్లో ఉత్సాహం పరుగులు దీసింది. భయం ధైర్యంగా మారింది. భర్త చేతుల్ని త్రిప్పి అతని చేతుల్తో అతణ్ణే కట్టేసి నట్టు వెనక్కుపట్టుకుంది.

"ఓసి పాపిష్టిదానా ! పతివ్రత పేరు పెట్టుకుని పతినే ... !" ఇంకా గట్టిగా అరవబోయాడు కాని జబ్బలమీద పడ్డ రెండు దెబ్బలకు పంచప్రాణాలు కదిలిపోయినై. మాటాగిపోయింది.

"మీరు మాత్రం మర్యాదా పురుషోత్తముని పేరు పెట్టుకోలేదూ ! పతివ్రత అంటే చెడిపోతున్న పతిని గాలికొదిలెయ్యడం గాదు మహానుభావా. ఎన్నిరోజుల నుండి చెబుతున్నాను పేకాట మానాలని, రానురాను రాజు గుర్రం గాడిదైనట్లు... ఈరోజు జీతం పోయింది. రేపు జీవితం పోతుంది."

"నీబొంద... విడువు .. విడువే !" తన్నబోయాడు.

"ఈరోజు జీతం డబ్బులు పోయినై, తర్వాత నా నగలకు కాళ్ళొస్తై, ఆ తర్వాత నన్ను అమ్మేసినా ఆశ్చర్యం లేదు." అంటూ రెండు చేతుల్ని అమాంతంపైకి లేపి కిందికి వంచింది. అతని నవనాడులు ముక్కలైపోతున్నై. కత్తెర బోనులో చిక్కుకున్న ఎలుకలా గిలగిల్లాడుతూ గింజుకుంటున్నాడు.

కిటికీలోంచి తోసుకొచ్చిన గాలి అలలకు వైదేహి శిరోజాలు కళ్ళమీదికొచ్చాయి. చేతులు వదిలేసి సవరించుకుంటుంది. అతడు శక్తినంతా కూడదీసుకొని పీకమీద చేతులేశాడు. మెరుపులా

అతని పొత్తి కడుపులో ఒకే ఒక ముష్టిఘాత్ పడిపోయింది. చెట్టు మీంచి రాలిన కాయలా మంచమ్మీద పడిపోయాడు.

ఇహలాభం లేదని తేలిపోయింది. భార్య కళ్ళలోని ఎర్రజీరల్ని అమాయకపు చూపుల్తో ఏరుకుంటూ "అమ్మో ! ఆడదంటే ఆదిశక్తని తెలిసిపోయింది వైదేహీ ! ప్లీజ్ .. ఇహ క్షమించెయ్. ఈ జన్మలో పేకాట ఆడనుగాక ఆడను. హమ్మో ! నువ్వు ఈ విధంగా జవాబిస్తావని నాకేం తెల్సూ ? .. చేతులు జోడించాలని ప్రయత్నిస్తున్నాడు.

"ఇది కలియుగమండీ ! మర్యాదకు రోజులున్నాయా ? ఈసారి పేకాడితే ఇల్లు పీకిపందిరేస్తాను ... జాగ్రత్త !" ఉరిమింది.

"అమ్మో ఆడదంటే అబలన్న వాని మూతి కుట్టెయ్యాలి ..." అంటూ పక్కకు తిరిగి పడుకున్నాడు.

"రాఘవా ! ఎప్పుడొచ్చావురా?" ఆవులిస్తూ వచ్చిన తల్లిదండ్రులనెలా పలుకరించాలో అర్థంగాలేదతనికి. భుజాలకింద చేతులేసి కూచొబెట్టింది వైదేహి.

"ఇప్పుడే వచ్చారత్తయ్యా ! పాపం ! తలనొప్పటా ..." అత్తా మామలకెదురెళ్ళి గదిలోకి తీసుకొచ్చింది. విద్యుత్కాంతిలో మెరిసిపోతున్న ఆవిడ నుదుటి బొట్టునే చూస్తున్నాడు రాఘవ. ఆ బొట్టు

"భారత్‌కి యహ నారీ హై
నారీ నహీ చింగారీ హై " అంటూ వార్నింగిస్తుంది.

"అయ్యో ! అదేం జబ్బురా !" అడుగుతున్న తండ్రివైపు చూడాలనిపించలేదు. మొహం కిందికి వేళ్ళాడ్తుంది.

"ఇదోరకమైన జబ్బు నాన్నా ! భయపడాల్సిందేమీ లేదు. ఇప్పుడే నీ కోడలు మందిచ్చింది. ఇహ జన్మలో మళ్ళీ ఈజబ్బు రాదు" అంటూ పక్కమీద ఒరిగిపోయాడు.

పైన సీలింగ్ ఫ్యాన్ పగలబడి నవ్వుతూంది.

మహిళ, ఆంధ్రప్రభ అనుబంధం - 19-12-1996.